క్లుప్తంగా

రేపు సువార్త స్వస్థత సభ

దాచేపల్లి : నడికుడి హోసన్నా మందిర్ ఆధ్వర్యంలో సువార్త స్వస్థత సభను ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నారు. హోసన్నా మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ ఈ సభలో వ్యాక్యోప సందేశాన్ని అందించి రోగుల కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేస్తారు. నడికుడి హోసన్నా మందిర్ ప్రాంగణంలో జరిగే ఈ సభకు విశ్వాసులు తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



దాచేపల్లి : ఆరోగ్యంపై మహిళలు దృష్టి సారించాలని డాక్టర్ సుచరిత అన్నారు. నడికుడి వార్డు సచివాలయంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సులో పీహెచ్‌సీ డాక్టర్ సుచరిత మాట్లాడుతూ.. ఆరోగ్యంపై మహిళలు నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. ఋతుక్రమము మహిళలకు సహజ సిద్ధమైందని, దీనిపై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సదస్సులో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, మెప్మా సిబ్బంది విజయలక్ష్మీ, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



దాచేపల్లి : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. నడికుడి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఎదురుగా వెళ్తున్న లారీ అతివేగంతో వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న కమలపూరి ఈశ్వరాచారి (52) అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వైఎస్సార్ కడప జిల్లా యరగుంట్ల మండలం చిలమకూరుకు చెందిన ఈశ్వరాచారి ద్విచక్రవాహనంపై నల్గొండ వైపు నుంచి వస్తున్నాడు. ముందు వెళ్తున్న లారీని ద్విచక్రవాహనం అదుపుతప్పి ఢీకొట్టింది. ద్విచక్రవాహనం నడుపుతున్న ఈశ్వరాచారికి తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ జీ. సంధ్యారాణి పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సేవతోనే సమాజంలో గుర్తింపు



మాచర్ల: పట్టణానికి చెందిన వివిధ కార్యక్రమాల్లో సేవకుడుగా పనిచేస్తున్న బహుజన పోరాట సమితి అధ్యక్షులకు హెల్ టాటా మనీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టరేట్ అవార్డును ఇవ్వడం జరిగిందని అవార్డు గ్రహీత కందుకూరి మధు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన డా''బిఆర్ అంబేడ్కర్, త్యాగరాయ గాన సభలో అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఈ అవార్డు ఇచ్చారు. పట్టణంలో ప్రజల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ అవార్డు అందుకున్న మధును పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

యడ్లపాడు: రోడ్డుపై ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన క్రమంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన తుమ్మలూరి రాజేష్ వ్యక్తిగత పనులపై శనివారం బైక్‌పై చిలకలూరిపేట వెళ్లి తిరిగి వంకాయలపాడు వస్తుండగా తిమ్మాపురం కల్పతరువు నూలుమిల్లు సమీపంలో ఆపిఉన్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో కిందపడిన అతనికి తలకు, కళ్లవద్ద, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది క్షతగాత్రుడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మద్యం సేవించి ఉన్నందునే ఈ ప్రమాదం జరిగిందని, వైద్యుల పరిశీలనలో వెల్లడైనట్లు ఎస్‌ఐ పైడి రాంబాబు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

క్రికెట్ కిట్ పంపిణీ

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామం ఎంపీటీసీ సభ్యురాలు దావులూరు సంపూర్ణ–శ్రీనివాసరావు దంపతులు రూ. 10వేలు విలువ చేసే క్రికెట్ కిట్‌ను ఎస్సీ కాలనీలో యువకులకు ఆదివారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఐతాం పాపయ్య, నాగార్జున, బందెల దేవానందం పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని చౌత్రాసెంటర్‌లో విజయ లక్ష్మి సర్వీస్‌సెంటర్ ముందు వ్యక్తి మృతి చెంది ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు శనివారం సాయంత్రం నుంచి బాగా మద్యం సేవించి అటువైపు తిరిగాడని స్థానికులు తెలిపారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ ఆశయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మహిళకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: పేదల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే)అన్నారు. కారెంపూడిలో నాలుగవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక ఇందిరా నగర్ కాలనీలో గడప గడప కార్యక్రమాన్ని ప్రారంభించి ఎస్సీ కాలనీ వరకు కొనసాగించారు. ప్రతి గడపకు వెళ్లి ఆ గడపకు గడచిన నాలుఏళ్ల కాలంలో నవరత్న పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని వివరించి సంక్షేమ కరదీపికలను అందించారు. ప్రతి ఒక్కరిని పలకరించి వారి సమస్యలను సావధానంగా విని పరిష్కారాన్ని కూడా అక్కడికక్కడే సూచించారు. అధికారులకు కూడా తగిన ఆదేశాలిచ్చారు. ఎస్సీ కాలనీలో రూ. 10 లక్షల ఖర్చుతో డ్రైనేజీ కాల్వలు నిర్మించి సమస్యను పరిష్కరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించడంతో పాటు, లూథరన్ చర్చికి రూ.2 లక్షలతో రంగులు వేయించినందుకు ఎమ్మెల్యే పీఆర్కేకు కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు. ఇందిరానగర్ కాలనీ పాఠశాలకు అదనపు భవనం నిర్మించడంతో పాటు పాఠశాలను అభివృద్ధి చేయడంపై ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు పాఠశాల రూపు రేఖలు ఉండేవి కాదని కాని ఇప్పుడు బాగుందని విద్యార్థుల సంఖ్య కూడా బాగా పెరిగిందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. నవరత్నాల ద్వారా లబ్ధి పొంది తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకున్న వారు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పీఆర్కేకు సాదర స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించి అల్పాహారాలు అందించారు. ఎన్నో ఏళ్లుగా నివేశన స్థలాలు లేక ఇబ్బంది పడుతున్న తమకు నివేశన స్థలాలివ్వడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. మొత్తం 300 గడపలను పీఆర్కే సందర్శించి వారిని పలకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. మొదట లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన పీఆర్కేకు చర్చి వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ యువకులు బాణా సంచా పేల్చి పూలతో ఘన స్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, జెడ్పీటీసీ షేక్ షఫీ, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, సచివాలయాల మండల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, కొమ్ము చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గుండెబోయిన అమృతలక్ష్మి, ఎంపీటీసీలు అంతరగడ్డ ఏసోబు, బొమ్మిన సావిత్రిఅల్లయ్య, షేక్ ఆరీఫ్, వేముల లింగయ్య, మాజీ సర్పంచ్ కంపా నాగరాజు, మాజీ ఎంపీటీసీ షేక్ ఖాసిమ్, ఆళం విజయభాస్కరరెడ్డి, గుండెబోయిన శివ, వార్డు మెంబర్ కాల్వ మౌనిక, నాయకులు మిద్దెపోగు పున్నయ్య, మిద్దెపోగు విజయ్, కాల్వ ప్రభుదాసు, నార్నెపోగు సుదర్శన్, మిద్దెపోగు ప్రవీణ్‌లు వారికి సహకారంగా వివిధ హోదాల పార్టీ నాయకులు కరాలపాటి సుబ్బారావు, గుండా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సూరె అంకారావు, మిత్తింటి సాంబశివరావు, సూరె సుబ్రమణ్యం, కొమ్ము చంద్రశేఖర్, పాతూరి రామిరెడ్డి, కిల్లా కాశి, చల్లా ప్రసాద్, చింతల శ్రీనివాసరావు, కొమెర పిచ్చెయ్య, ఆతుకూరి గోపి, మర్రి శేషయ్య, జొన్నల గడ్డ శ్రీను, కాలె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పునరుద్ధరణ, శంకుస్థాపనకు పీఆర్కేకు ఆహ్వానం



పీఆర్కేను శాలువాతో సత్కరించి ఆహ్వానపత్రిక అందజేస్తున్న జంగా కృష్ణమూర్తి

మాచర్ల: ప్రసిద్ధిగాంచిన పల్నాడులోని గురజాల నియోజక వర్గంలో పల్నాడు నాగమ్మ శైవక్షేత్రము చెన్న మల్లిఖార్జున స్వామి ఆలయ పునరుద్ధరణ, శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత శ్రీ మహారాజ రాజేశ్వర స్వామివార్ల దేవస్థానం, జిట్ట గామాలపాడు గ్రామము, దాచేపల్లి మండలము, పల్నాడు జిల్లాలో జూన్ 7వ తేదన శంకుస్థాపన చేయనున్నట్లు శాసన మండలి ప్రభుత్వవిప్ జంగా కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం మాచర్ల పట్టణం విచ్చేసిన ఆయన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించి ఆహ్వానమందించారు. పల్నాటి చరిత్రకు సంబంధించి దేవాలయాల నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పీఆర్కేని కోరారు. ఈ సందర్భంగా జంగా విలేకరులతో మాట్లాడుతూ గామాలపాడు గ్రామంలో జూన్ 7వ తేదీన ఉ.7.45ని''లకు శ్రీశైవ క్షేత్ర పీఠాధిపతి శ్రీ శివస్వామి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పల్నాటి ప్రజలంతా హాజరు కావాలన్నారు. పల్నాటి చరిత్రను తెలిపేందుకే రాజకీయాల కతీతంగా ఈ దేవాలయాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. గ్రంథాలయం, మ్యూజియం, కల్యాణమండపం, ఏర్పాటు చేసి పల్నాటి చరిత్ర భావితరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ప్రముఖులంతా హాజరవుతారన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బత్తుల ఏడుకొండలు, కామనబోయిన కోటయ్య, సీనియర్ న్యాయవాది జీవి, జెడ్పీటీసీ పెద మల్లుస్వామి, ఆర్యవైశ్య సంఘ నాయకులు చందూరు రోశయ్య, కొత్తమాసు బ్రహ్మారావు, మారం వాసు, రిటైర్డ్ డిప్యూటీడి ఈఓ గాదె రామకృష్ణారావు తదితరులున్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి



రైతులతో మాట్లాడుతున్న సౌత్ ఇండియా జనరల్‌మేనేజర్ పీవీ రాజశేఖర్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరగడం వల్ల సాగువ్యయం విపరీతంగా పెరిపోతుందని సౌత్ ఇండియా జనరల్ మేనేజర్ పీవీ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామంలో ప్రపంచ పౌష్టికాహార దినోత్సవం సందర్భంగా ఎస్ఎంఎల్ వారి ఆధ్వర్యంలో రైతులకు పౌష్టికాహార విశిష్టతను, భూసారం గురించి రైతులకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలో సారం పెరగడం వల్ల పంటల్లో దిగుబడి పెరుగుతుందని ఆయన అన్నారు. పంటల్లో పౌష్టికాహారాన్ని ఎలా పెంచాలో రైతులకు వివరించారు. అందుబాటులో ఉన్న వనరులను వాడుకుంటూ అతితక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునని ఆయన అన్నారు. అనంతరం భూ పరీక్ష ఎలా నిర్వహించుకోవాలో వారు చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ కె. మహేష్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ బీవీ సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పవన్‌కుమార్, కిషోర్, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలపై మహిళలను చైతన్యపర్చండి



ర్యాలీ నిర్వహిస్తున్న మెప్మా, డ్వాక్రా సంఘాల మహిళలు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మాచర్ల: ప్రతి మహిళా యుక్త వయసు వచ్చినప్పటి నుంచి ఋతుస్రావం సమయంలో జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యురాలు లక్ష్మీ ప్రసన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో అంతర్జాతీయ ఋతుస్రావం దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సును స్థానిక మిషన్ మేనేజర్ సుబ్బారావు, సీసీ అంజలిదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలకు ప్రత్యేకంగా ఆర్పీలు జాగ్రత్త చర్యగురించి వివరించాలన్నారు. ఆరోగ్యం దెబ్బతినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలనే విషయం పై ప్రతి మహిళకు తెలియపరిచే బాధ్యతను మెప్మా ప్రాజెక్టులోని రిసోర్సు పర్సన్‌లు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఎటువంటి జాగ్రత్త చర్యలు తీసుకోవాలనే దాని పై వివరించారు. కార్యక్రమంలో అంజలీదేవి మహిళలు తీసుకోవాల్సిన వాటి పై పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు ఆర్పీలు, పలువురు డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: మే 28న ప్రపంచ వ్యాప్తంగా రుతుక్రమ పరిశుభ్రదత దినంగా పాటిస్తున్నట్లు డాక్టర్ గీతాంజి, అనిల్‌కుమార్ అన్నారు. పట్టణంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారం నిర్వహించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి స్త్రీ ఋతుస్రావం అని పిలువబడే నెలవారి జీవన చక్రాన్ని అనుభవిస్తోంది, ఇక్కడ గర్భాశయం యొక్క లైనింగ్ విచ్చన్నమై యోని ద్వారా షెడ్ అవుతుందన్నారు. ఋతుస్రావం గురించి బహిరంగంగా మాట్లాడడానికి, ప్రపంచవ్యాప్తంగా మాట్లాడడానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాలికలు, యుక్తవయస్సులోని బాలికలలో ఋతు పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంపొందించుకోవాలని తెలియజేశారు. ఆరోగ్య నిర్వహణపై మహిళలు, బాలికల కోసం ఐక్యంగా బలమైన గొంతుకను పెంచడానికి వ్యక్తులు, సంస్థలు, సామాజిక వ్యాపారాలు, వీడియోను ఒక వేదికా చర్చించడం ఋతు ఆరోగ్యదినోత్సవం యొక్క లక్ష్యమని తెలియజేశారు. కార్యక్రమంలో సీఎంఎం జి. శ్రీనివాసరావు, సీవో కె. శ్రీనివాసరావు,డి. బాలు, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

అడవులను సంరక్షించుకోవాలి


ఫారెస్ట్ రేంజర్ సత్యనారాయణరెడ్డి



నాగార్జునకొండలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి, సిబ్బంది

విజయపురిసౌత్: మానవుల మనుగడ కోసం అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. విజయపురిసౌత్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా సత్యనారాయణ నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆదివారం నాగార్జునకొండను సందర్శించారు. ముందుగా స్థానిక లాంచీస్టేషన్ వద్ద మరమ్మతులకు గురైన ఫారెస్ట్ బోట్‌ను పరిశీలించారు. అనంతరం కొండకు చేరుకుని కొండలోని అటవీ జంతువుల గురించి ఆరా తీశారు. అడవులను, అటవీ జంతువులను సంరక్షించేకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అటవీ భూములు ఆక్రమణకు గురి కాకుండా సిబ్బంది పహారా కాస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎఫ్‌బీవో అనిల్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు



కోదండ రామస్వామి దేవాలయం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కోదండ రామస్వామి దేవాలయంలో ఈ నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు కోదండ రామస్వామివారి నూతన పంచలోహ ఉత్సవ విగ్రహాలు, హనుమత్, విగ్రహ, రాజ్యలక్ష్మి విగ్రహాలు, ధ్వజస్తంభ, రాజగోపుర ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట వేడుకలు టీటీడీ ఆగమ పండితులు శ్రీమాన్ డాక్టర్ నారాయణం తనజ్ విష్ణువర్ధనాచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చకులు నారాయణం రామమోహనాచార్యులు పర్యవేక్షణలో జరగనున్నట్లు వివరించారు. ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి 30వ తేదీ వరకు భగవత్ ప్రార్థనం, విష్వేక్సేనారాధనం, పుణ్యాహవాచనం, అగ్ని ప్రణయనం, కుంభారాధనం, మహాశాంతి హోమం, మంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. చివరి రోజు 31వ తేదీన స్వామివార్ల విగ్రహ ప్రతిష్టతో పాటు ధ్వజస్తంభ స్థాపన, రాజగోపుర ప్రతిష్ట వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కోదండ రామస్వామి వారి కళ్యాణ మహోత్సవం జరపనున్నట్లు తెలిపారు. భక్తులందరికి అన్నసంతర్పణ కార్యక్రమం ఉంటుందని, భక్తులు వేలాదిగా పాల్గొని ప్రతిష్టా మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా బంగారు మైసమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో బంగారు మైసమ్మ అమ్మవారు

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో వేంచేసిన బంగారుమైసమ్మతల్లి అమ్మవారి జాతర వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు వడితే ముత్యాలునాయక్ నేతృత్వంలో ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి ఉదయం 6గం.లకు గంగ స్నానం, 9గం.లకు కుంకుమపూజతో పాటు వివిధ పూజా కార్యక్రమాలను జరిపించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం 6గం.ల నుంచి ఏర్పాటు చేసిన మూడు కుంకుమ బండ్లుతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పెద్దల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు వడితే భీమ్లా నాయక్, వడితే భగ్గునాయక్, వడితే హనుమానాయక్, వడితే తులశ్యానాయక్, వడితే రామదాసునాయక్, వడితే బాలునాయక్, వడితే లింగానాయక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మైనర్లు వాహనాలు నడిపితే కేసు

నాదెండ్ల: మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయటమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తామని ఎస్‌ఐ ఆవుల భాస్కర్ హెచ్చరించారు. నరసరావుపేట డీఎస్పీ ఆదేశాల మేరకు గణపవరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలువురు మైనర్లు వాహనాలు నడుపుతుండటం గుర్తించి కేసులు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపటం, పరిమితికి మించి వాహనాలపై ప్రయాణిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

31న మాన్యం భూముల కౌలు వేలం

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పలు దేవాలయాలకు చెందిన మాన్యం భూముల కౌలు వేలం ఈ నెల 31న నిర్వహిస్తామని ఈఓ బి.శ్రీనివాసులు తెలిపారు. అదే గ్రామంలోని వేణుగోపాలస్వామికి చెందిన 18.60 ఎకరాల భూమి, పార్వతీసమేత సోమేశ్వరస్వామి దేవాలయానికి చెందిన మాన్యం 5 ఎకరాలు, గంగమ్మ అమ్మవారి మాన్యం 7 ఎకరాలు, అదేవిధంగా వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో గదుల అద్దెకు సంబంధించి వేలంతో పాటు రావులాపురంలో వేంచేసి ఉన్న మన్నేపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి చెందిన భూములకు వేలం ఈ నెల 31న ఉదయం 10గంటల నుంచి 11.30గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామికి చెందిన భూములు మండలంలోని రేమిడిచర్ల గ్రామపరిధిలో 4.41 ఎకరాలు, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం బీరేన్డుపల్లి గ్రామపరిధిలో 2.08 ఎకరాలు భూములకు సంబంధించి వెల్లటూరు గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వేలంపాట నిర్వహిస్తామన్నారు. పాల్గొనదలిచిన వారు రూ.5వేలు, రూ.10వేలు ధరావతు చెల్లించాల్సి ఉంటుందని ఈఓ తెలిపారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

దాచేపల్లి : మండలంలోని తంగెడ భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. భవ్య సిమెంట్స్ ఆధ్వర్యంలో గుంటూరు శ్రీ హస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. వెంకటరాజు ప్రారంభించారు. తంగెడ, ముత్యాలంపాడు గ్రామస్తులతో పాటుగా ఫ్యాక్టరీ విధులు నిర్వహించే సిబ్బందికి ఎముకలు, కీళ్లు, కిడ్నీ, షుగర్, బీసీతో పాటుగా సాధారణ రోగాలకు వైద్యులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. భవ్య సిమెంట్స్ యజమాన్యం ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, భవిష్యత్‌లో మరిన్ని సీఎస్ఆర్ కార్యకలపాలు కొనసాగించాలని జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి కోరారు. ఈ శిబిరంలో సర్పంచ్‌లు కొత్తపల్లి కాశయ్య, ఎస్. వెంకటచారి, ఎంపీటీసీ పాస వెంకటనాగయ్య, పోతుల ప్రసన్నకుమార్, యూనిట్ హెడ్ బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కారుచోలలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలను నిర్వహిస్తున్న దృశ్యం

యడ్లపాడు: ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని షేక్ జాన్ సైదా చెప్పారు. మండలంలోని కారుచోల గ్రామం ఉర్దూ పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా కంటివైద్య శిబిరాన్ని జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సంస్థ చైర్మన్ జాన్‌సైదా ప్రారంభించిన ఈ శిబిరంలో గ్రామస్తులతో పాటు సమీప ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు. కంటికి సంబంధించిన వైద్యులు 320 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అనంతరం బోయపాలెం గ్రామంలో ఇటీవల నిర్వహించిన శిబిరంలో గుర్తించిన 125 మందికి కళ్లజోళ్లను అందజేసినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు కంజుల వీరారెడ్డి, గొంటు శ్రీనివాసరెడ్డి, జాలాది సుబ్బారావు, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, ఈదర కోటయ్య స్వామి, బాష, కొమ్మనబోయిన రమేష్, పట్నం కరిముల్లా, కూరపాటి ఆంజనేయులు, జమ్మలమడక ఆదిబాబు, కొక్కిరి చిట్టిబాబు, బీవీరెడ్డి, కారుచోల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన లారీ

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం ప్రధాన సెంటర్ జాతీయ రహదారి మార్గంలో ఆగి ఉన్న కారును లారీ ఢీకొట్టిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. స్థానికుల వివరాల మేరకు త్రిపురాంతకంలో వేంచేసియున్న బాలత్రిపురసుందరిదేవి అమ్మవారి దర్శనం చేసుకొని తిరిగి గుంటూరుకు బయలుదేరిన శరత్‌చంద్రబోసు కుటుంబసభ్యులు, స్నేహితులు నలుగురు కారులో వస్తున్నారు. ఈక్రమంలో శావల్యాపురం సెంటరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద కారు రోడ్డు పక్కన నిలిపారు. ఇదే క్రమంలో పిడుగురాళ్ల నుంచి బెంగళూరుకు పొడరులోడుతో వెళుతున్న లారీ అతివేగంతో కారును ఢీకొట్టింది. లారీ ఆగకుండా పోతుండగా గ్రామస్తులు కేకలు వేసి లారీని నిలువుదల చేసి పోలీసులకు సమాచారం అందించారు. అయితే కారులో ఉన్నవారికి ఎటువంటి గాయాలు కాలేదు. కారు ముందుభాగం పూర్తిస్థాయిలో దెబ్బతింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోని, వివరాలు సేకరించి లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

2వేల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు

శావల్యాపురం: రైతుల నుంచి 2వేల క్వింటాళ్ల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసినట్లు మండలంలోని కారుమంచి గ్రామ సొసైటీ కేంద్రం సీఈఓ డి.వెంకట నారాయణ ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా సీఈఓ మాట్లాడుతూ కారుమంచి సొసైటీ పరిధిలో గుంటుపాలెం, వయ్యకల్లు, భాస్కర్‌నగర్, ధర్మపురి, కారుమంచి గ్రామాలు ఉండగా, ఆయా గ్రామాలకు చెందిన 36 మంది రైతుల నుంచి 2వేల క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేయగా 11 మంది రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మాచర్ల: నియోజక వర్గంలోని వెల్దుర్తి మండలంలోని శ్రీరాంపురంతండాలో ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీ కొని ఒక మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలైన ఘటన శనివారం రాత్రి జరిగింది. శ్రీరాంపురంతండాకు చెందిన నేణావత్ ఆంజనేయులు నాయక్ ఇద్దరు మహిళలతో కలిసి కూలి పనులు ముగించుకుని గ్రామానికి వస్తుండగా ఎదురుగా ఉన్న ట్రాక్టర్ ఢీ కొనడంతో కాండ్లావత్ హూనీబాయి (45) మృతిచెందగా వాహనం పై ప్రయాణిస్తున్న కాండ్లావత్ లక్ష్మీబాయి, ఎన్ ఆంజనేయులు నాయక్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని నరసరావుపేట ఆసుపత్రికి తరలించగా, మృతురాలు కాండ్లావత్ హూనీబాయి ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు వెల్దుర్తి ఎస్‌ఐ వి శ్రీహరి ఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

వినుకొండ(నూజెండ్ల): ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ నుంచి మహిళల ఆరోగ్యంపై మెప్మా సిబ్బంది ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, రక్తహీనతతో బాధపడకుండా ఆకుకూరలు, పండ్లు, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షకీలా దస్తగిరి, పలువురు డాక్టర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.